క్లుప్తంగా

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మోతె : కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పార్టీ మండల అధ్యక్షుడు కీసర సంతోష్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి చొరవతో మండలంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణానికి ఉపాధి హామీ నిధులు రూ.1.45 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్ ఆర్డర్ కాపీలను కార్యకర్తలకు అందజేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చట్టం తేవడం హర్షణీయం

మునగాల: వీసా గడువు ముగిసినప్పటికీ భారత్‌లో ఉన్న విదేశీయుల వల్ల భారతదేశానికి ముప్పు కలుగుతుందని వారిని దేశం నుంచి పంపించే విధంగా కేంద్ర ప్రభుత్వ చట్టం తీసుకురావడం హర్షణీయమని మునగాలకు చెందిన ప్రముఖ న్యాయవాది మిర్యాల మంగయ్యగౌడ్ తెలిపారు. శనివారం ఆయన మునగాలలో విలేకరులతో మాట్లాడుతూ ఈ చట్టం తీసుకురావడానికి కృషిచేసిన ప్రధాని మోదీ, రాష్ట్రపతి ముర్ము, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న శైలజ

నడిగూడెం : ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఖమ్మం జిల్లా పీఎస్ఎస్ఎం అధ్యక్షురాలు ధ్యానరత్న కాటేపల్లి శైలజ తెలిపారు. నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో గత 41 రోజులుగా నిర్వహిస్తున్న మండల ధ్యానంలో భాగంగా శనివారం ముగింపు కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆలయ కమిటీ చైర్మన్ భవురిశెట్టి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ



కిట్ అందజేస్తున్న వైద్యాధికారి నరేష్

గరిడేపల్లి : టీబీ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని వైద్యాధికారి వి.నరేష్ అన్నారు. శనివారం గరిడేపల్లి మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 21 పౌష్టికాహార కిట్లను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్స్ ఎస్.అంజయ్యగౌడ్, వెంకటరమణ, యశోద, ఉపేందర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ఏపీ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను హుజూర్‌నగర్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్ఐ అంతిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బలుసుపాడు శివారు సింగారం వాగు నుంచి హుజూర్‌నగర్ మండలంలోని దొండపాడు గ్రామానికి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు దొండపాడు గ్రామ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. జగ్గయ్యపేట మండలం బలుసుపాడుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పందుల వినోద్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కూలీలకు వసతులు కల్పించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని అంజలిపురంలో ఉపాధి హామీ పనులను ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ ఖాసీం, కొప్పుల నాగయ్య, వెంకన్న, సీతారామయ్య, కోటమ్మ, సీతమ్మ, జ్యోతి, కూలీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నడిగూడెం : మండలంలోని సిరిపురం సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతులు చేపడుతున్నందున సిరిపురంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ కె.సైదయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపారు.

సీపీఎం ఇంటింటి సర్వే

గరిడేపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో సీపీఎం నాయకులు ఇంటింటి సర్వే నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి ఎస్‌కే యాకూబ్, నాయకులు తుమ్మల సైదయ్య, సుందరి వీరరాఘవయ్య, బొల్లెపల్లి శ్రీనివాస్, నారాయణ, సైదులు, నాగరాజు, నరసింహారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని మర్రిగూడెంలో హుజూర్‌నగర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో శనివారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మాజీ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, సర్పంచ్ దొంగరి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వర్లు, జానివియా, జోగేశ్వరరావు, హతుయాతుద్దీన్, బాషా, ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు!



రావిపహాడ్- సిరికొండ గ్రామాల మధ్య ప్రమాదకరంగా రోడ్డు మూలమలుపు



సిరికొండ- మోతె గ్రామాల మధ్య ఇలా..

- ప్రమాదకరంగా మూలమలుపులు
- హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ప్రజల వేడుకోలు

మోతె : మోతె మండలంలో పలు గ్రామాలకు వెళ్లే రహదారుల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేవు. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. రహదారులు సైతం అధ్వానంగా ఉన్నాయి. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. మూలమలుపుల్లో స్పీడ్‌గా వెళితే వాహనాలు బోల్తా పడడం ఖాయం అన్నట్లు ఉన్నాయి. ముఖ్యంగా మోతె నుంచి సిరికొండ, రావిపహాడ్ గ్రామాలకు వెళ్లే మార్గం, హుస్సేన్‌బాద్ -బుర్కచర్లకు వెళ్లే రోడ్డు, విభళాపురం నుంచి కరక్కాయలగూడెం, విభళాపురం నుంచి బుర్కచర్ల గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో మూలమలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఉర్లుగొండ నుంచి నర్సింహాపురం, తుమ్మగూడెం, నేరడవాయి, గోపతండాకు వెళ్లే రోడ్డు మార్గంలో కూడా ఇదే పరిస్థితి. తండాలు, మారుమూల గ్రామాల ప్రజలు మోతె మండల కేంద్రానికి చేరుకోవాలంటే ఈ రహదారుల నుంచే వెళ్లాలి. సర్వారం నుంచి వయా గోల్‌తండా, బుర్కచర్ల, హుస్సేనాబాద్ గ్రామాల నుంచి మోతె మండల కేంద్రానికి వెళ్లాల్సి ఉంది. కానీ మూలమలుపులతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయంభయంగా వెళ్లాల్సి వస్తోంది. ఇక రావిపహాడ్, సిరికొండ గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు కూడా మూలమలుపులతోనే ప్రమాదకరంగానే ఉంది. కావున సంబంధిత అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పెన్షనర్ల క్రీడా పోటీలను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామయ్య

కోదాడరూరల్ : కోదాడ పట్టణంలో ఆదివారం నుంచి మూడు రోజుల పాటు కోదాడ రిటైర్డు ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించబోయే పెన్షనర్ల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రావెళ్ల సీతారామయ్య కోరారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెన్షనర్లకు రాష్ట్ర స్థాయిలో క్రీడా, సాంస్కృతిక, సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలను ప్రారంభించేందుకు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డిలతో పాటు ఆల్ ఇండియా, రాష్ట్ర పెన్షనర్ల సంఘం నాయకులు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బొల్లు రాంబాబు, కోదాడ అధ్యక్షుడు వేనేపల్లి శ్రీనివాసరావు, అక్కిరాజు వెంకట్రావు, రఘువరప్రసాద్, వీరబాబు, ఖలీల్‌అహ్మద్, జార్జి తదితరులు ఉన్నారు.

ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం సహకరించాలి

హుజూర్‌నగర్ : ఇంటి స్థలం ఉండి అర్హులైన పేదలకు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సహకరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పల్లె వెంకటరెడ్డి అన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న పోరుబాటలో భాగంగా శనివారం హుజూర్‌నగర్ పట్టణంలోని 12వ వార్డులో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి స్థలం ఉండి అర్హులైన వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కోరారు. నాయకులు టి.యోన, వీరమల్లు, శంభయ్య, వెంకటనారాయణ, వీరస్వామి, వీరబాబు, వెంకన్న, శంకర్, వెంకన్న, గోవిందు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలి



గోవిందపురంలో స్థపతి ఈమని శివనాగిరెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

హుజూర్‌నగర్ : సనాతన ధర్మ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ప్రముఖ చరిత్రకారుడు, స్థపతి, డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. శనివారం హుజూర్‌నగర్ పరిధిలోని గోవిందపురంలో రామాలయ పునఃనిర్మాణ స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాన్ని గర్భాలయం, అర్ధ మండపం, మహామండపాలతో ఒక అంతస్తు నిర్మించాలని తెలిపారు. రామాలయాన్ని పునర్మించడం సంతోషకరమని తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది నారపరాజు శ్రీనివాసరావు, బాచిమంచి చంద్రశేఖరరావు, కంచర్ల అరవింద్ రెడ్డి, పులిచింతల ప్రతాప్‌రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇట్టిమల్ల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు ఇట్టిమల్ల బెంజిమెన్, కమిటీ సభ్యులు బొల్లెద్దు జైలు, రంజిత్, పాపారావు, రాంబాబు, క్రాంతి, రాములు, రామకృష్ణ, నారాయణ, లక్ష్మయ్య, రాజేష్, శేఖర్, లక్ష్మీనరసయ్య, శ్రీను, ముత్తమ్మ, జ్యోతి, విప్లవ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్ష



నేరేడుచర్ల : దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేరేడుచర్ల : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేవరకు ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని కోరుతూ నేరేడుచర్ల పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఇంజమూరి మల్లయ్య, యడవల్లి చంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు యడవల్లి అరుణ్‌కుమార్, దోరేపల్లి వెంకటేశ్వర్లు, ఇంజమూరి పున్నయ్య, వింజమూరి వెంకన్న, శంకర్, ఉపేందర్, శ్రీను, రవి, శేఖర్, ఈదయ్య తదితరులున్నారు.

11 శాతం రిజర్వేషన్ కల్పించాలి

నడిగూడెం : మాదిగలకు 11 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని, ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దని డిమాండ్ చేస్తూ శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ కోదాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూరి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకుడు వేపూరి పర్వతాలు, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మొలుగూరి సైదులు, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు మిట్టగణుపుల మోష, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పందిటి నవీన్‌కుమార్, వీహెచ్‌పీఎస్ నాయకులు గుర్వయ్య, స్నేహలత చౌదరి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలు నిలిపివేయాలి

మునగాల : ఎస్సీ వర్గీకరణ చట్టం చేసేవరకు రాష్ట్రంలో ఉద్యోగ పరీక్ష ఫలితాలు, ఉద్యోగ నియామకాలను నిలిపివేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోట్ల నాగరాజు కోరారు. ఎమ్మార్పీయస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో మునగాలలో చేపట్టిన నిరసన దీక్ష శనివారం మూడవ రోజుకు చేరింది. ఎంఎస్‌పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య దీక్షను విరమింపజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ మండల శాఖల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, లంజేపల్లి శ్రీను మాదిగ, నాయకులు పెద్ద కనకయ్య, శ్రీకాంత్, ఈదయ్య, సాయికుమార్, బుజ్జిరాజు, పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి మద్దతు

హుజూర్‌నగర్ : తెలంగాణలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేస్తున్న ఉద్యమానికి బీసీ హక్కుల సాధన సమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ తెలిపారు. శనివారం హుజూర్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దీక్షా శిబిరంలో నాయకులు చింతిరాల నాగయ్య, గల్లా వెంకటేశ్వర్లు, ఒగ్గు విశాఖ, మందా వెంకటేశ్వలు, గుండెపంగు బాబు, శరత్, వెంకటేశ్వర్లు, రవీందర్, క్రాంతి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత



చిలుకూరు : ప్యాడ్లు అందజేస్తున్న అయోషా ఫౌండేషన్ సభ్యులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం అయోషా ఫౌండేషన్ తరఫున పరీక్ష సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుజ్జుల నరసింహారెడ్డి, ఫౌండేషన్ చైర్మన్ జానిమియా, పాఠశాల చైర్మన్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శోభన్‌బాబు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శి భోనగిరి ఉపేందర్, కాసాని సతీష్, కోఆప్షన్ మాజీ సభ్యుడు ఎండి.జలీల్, కన్నెబోయిన మురళి, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సేవ చేయడం అభినందనీయం



మాట్లాడుతున్న సీఐ చరమందరాజు

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండా గ్రామ అభివృద్ధికి స్థానికుడు మాలోతు బాబునాయక్ అందిస్తున్న సేవలు అభినందనీయమని హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు అన్నారు. బాబునాయక్ ఆర్థిక సహకారంతో మంచ్యాతండా గ్రామం చుట్టూ ఏర్పాటు చేసిన ఐదు సీసీ కెమెరాలను శనివారం సీఐ ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో దోపిడీలు, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాల పాత్ర కీలకమన్నారు. గ్రామంలో మహిళలపై వేధింపులు, అన్యాయాన్ని యువత వ్యతిరేకించాలన్నారు. ఈ విషయంలో పోలీసుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. అనంతరం బాబును శాలువాలతో సత్కరించి అభినందించారు. మఠంపల్లి ఎస్ఐ పి.బాబు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు రాయసెల్, కోట్యా, కిషన్, భక్షానాయక్, సక్రియానాయక్, చంద్రు, గోపా తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా వ్యవహరించాలి

- ఎస్పీ కె.నర్సింహ



మునగాల పోలీస్ స్టేషన్‌లో రికార్డును పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

మునగాల : పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధిత ఫిర్యాదుదారుల పట్ల సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కె.నరసింహ సూచించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శనివారం మునగాల పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రిసెప్షన్‌లో రికార్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారిపై ఉన్న పోలీస్ స్టేషన్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, ఏఎస్ఐ కె.శ్రీనివాసరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం ఎస్పీ నర్సింహ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని అన్ని రకాల రిజిస్టర్లు, స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలపై స్టేషన్లకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలందించాలన్నారు. ఆయన వెంట మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, నడిగూడెం, మునగాల ఎస్ఐలు అజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, ఏఎస్ఐలు మన్సూర్, జగన్నాథం, సిబ్బంది ఉన్నారు.

శాంతిభద్రతలను కాపాడాలి



సీఐకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన కె.శివశంకర్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. నాయకులు గంధం పాండు, గాలి శ్రీనివాస్‌నాయుడు, గుండెపంగు రమేష్, యేషయ్య, సుందర్‌రావు, లక్ష్మీనారాయణ, రాంబాబు, సంజీవ్, నిఖిల్, రోషన్ ఉన్నారు.

కవయిత్రి మొల్లమాంబ విగ్రహం ఆవిష్కరణ



మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయవాది వెంకటేశ్వర్లు, నాయకులు

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో గల శాలివాహన(కుమ్మరి) నిత్యాన్నదాన సత్రంలో తెలుగు కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని శనివారం న్యాయవాది చిలువేరు వెంకటేశ్వర్లు, దాత, సత్రం కమిటీ, కుల పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన కవయిత్రి మొల్ల తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయికి నిలిచారని, శాలివాహనులకు ఎనలేని గుర్తింపు తెచ్చారని అన్నారు. అనంతరం విగ్రహం దాత హుజూర్‌నగర్‌కు చెందిన డాక్టర్ దూకుంట్ల భిక్షపతిని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సత్రం కమిటీ అధ్యక్షుడు గొట్టం సంజీవరావు, చలిగంటి రామారావు, మల్లికంటి బుచ్చయ్య, గొల్లపల్లి కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి



హుజూర్‌నగర్ రూరల్ : కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ సైదానాయక్



గరిడేపల్లి : ఏఐ కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంఈఓ చత్రునాయక్



నేరేడుచర్ల : కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి

నడిగూడెం : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని మండల విద్యాధికారి బి.ఉపేందర్‌రావు కోరారు. శనివారం నడిగూడెం మండల పరిధిలోని వల్లాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఏఐ ఏఎక్స్ఎల్ కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ వట్టికూటి సౌజన్య, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ జి.పద్మావతి, ప్రధానోపాధ్యాయులు వనమా సత్యనారాయణ, సనత్ కుమార్, సీఆర్‌పీ గురుస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యం

హుజూర్‌నగర్‌రూరల్ : విద్యా రంగాన్ని బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మండల విద్యాశాఖ అధికారి భూక్యా సైదానాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని బూరుగడ్డలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యాశాఖ, ఎస్సీ ఈఆర్టీ సంయుక్తంగా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి బీరెల్లి శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల్లో వెనుకబడిన విద్యార్థుల కోసం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను ఉపయోగిస్తూ కంప్యూటర్ ద్వారా ఎఫ్ఎల్ఎన్, ఏఐ ఏఎక్స్‌ల్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శాంతి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ప్రశాంతి, జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు రేణుక, సుధాశ్రీ, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండాలి

గరిడేపల్లి : విద్యార్థులకు ఆధునిక సాంకేతికతపై అవగాహన ఉండాలని ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వెలిదండ, రాయినిగూడెం, గానుగబండ గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కంప్యూటర్ ల్యాబ్‌లను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సువర్ణ, కె.కనకయ్య, నాగమణి, పిచ్చయ్య, ఉపాధ్యాయులు చంద్రయ్య, పద్మ, బాలసైదిరెడ్డి, జానకిరెడ్డి, సీహెచ్.వెంకటేశ్వరరావు, సీఆర్పీలు రామకృష్ణ, వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఉపాధ్యాయులు పోటు రామారావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

నేరేడుచర్ల : విద్యార్థులు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, ఎంఈఓ సత్యనారాయణరెడ్డి, జిల్లా కోఆర్డినేటర్, సెక్టోరియల్ అధికారి జనార్దన్ అన్నారు. శనివారం నేరేడుచర్ల మండలం చింతకుంట్లలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణను వారు ప్రారంభించి మాట్లాడారు. ఇంగ్లిష్, గణితంపై పట్టు సాధించేందుకు ప్రత్యేక కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నందున విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ వెంకటమ్మ, పరమేశ్వరి, మాజీ సర్పంచ్ మనోజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి



మోతె : బీక్యాతండాలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మోతె : మోతె మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం సీపీఎం ప్రతినిధుల బృందంతో కలిసి మండల పరిధిలోని బీక్యతండాతో పాటు పలు గ్రామాల్లో ఎండిన వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటలు ఎండిపోయి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.30 వేల నష్టపరిహారం చెల్లించాలన్నారు. మండలానికి ఎస్సారెస్పీ కాల్వల ద్వారా సాగు నీరు రాక వేలాది ఎకరాల వరి ఎండిపోయిందన్నారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు బానోతు లచ్చిరాం, చర్లపెల్లి మల్లయ్య, జంపాల స్వరాజ్యం, బానోతు వెంకన్న, బానోతు బాష, పాప, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

మునగాల : ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా నాయకుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు ఆరోపించారు. శనివారం కొక్కిరేణి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో పోరుబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతాంగానికి ఇచ్చిన హామీ మేరకు రూ.రెండు లక్షల రుణమాఫీ, రైతుభరోసా, ధాన్యానికి బోనస్ తక్షణమే అమలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ కొక్కిరేణి గ్రామ శాఖ కార్యదర్శి నందిగామ సైదులు, మండల కమిటీ సభ్యులు రేఖ లింగయ్య, మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు ఝాన్సీ, వట్టెపు చిన సైదులు, ములకలపల్లి సైదులు, రావులపెంట వెంకన్న, బ్రహ్మం, నిడిగొండ శంభయ్య, గురుమూర్తి, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



కోదాడరూరల్ : కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న చైర్మన్ దంపతులు

కోదాడరూరల్ : మండలంలోని తొగర్రాయిలో శ్రీసంతాన వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ముందుగా స్వామివారు, అమ్మవారిని అలంకరించి, దివిటీ ఉత్సవం, ఎదుర్కోలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి తిరుకల్యాణాన్ని నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, పట్టు వస్త్రాల సమర్పణ, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి వైదిక క్రతువును అర్చకులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమరనాయిని వెంకటేశ్వరరావు సంధ్య దంపతులు, అర్చకులు ముడుంబ విష్ణువర్ధన ఆచార్య, వేద పండితులు నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణా ఆచార్య, రాజన్ ఆచార్య, యాదా రమేష్, శ్రీనివాసరావు, అచ్యుతారం, నారాయణరావు, సింగరయ్య, ఏడుకొండలు, ఉపేందర్, గోపిరెడ్డి, అర్చకులు ఉన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి తిరు కల్యాణం

మోతె : మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి తిరు కల్యాణ మహోత్సవాన్ని శనివారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అప్పులు చేస్తూ.. ఐపీలు పంపిస్తూ

- రెండు నెలల క్రితం రెండు కోట్లతో పరారైన ఓ వ్యాపారి
- తాజాగా నాలుగు కోట్లకు కుచ్చు టోపీ పెట్టిన మరో వ్యక్తి

కోదాడ : అధిక వడ్డీ ఆశ చూపుతూ తెలిసిన వారి వద్ద అప్పు చేసి కోట్ల రూపాయలు కూడేస్తున్న కొందరు రాత్రికి రాత్రే బిచాణ ఎత్తి వేస్తుండడంతో అప్పులిచ్చినవారు లబోదిబోమంటున్నారు. కోదాడ పట్టణంలో రెండు నెలల వ్యవధిలోనే ఇలాంటి సంఘటనలు రెండు చోట్ల చేసుకోవడంతో పట్టణంలో ఈవిషయం చర్చనీయాంశంగా మారింది. పట్టణంలోని అనంతగిరి రోడ్డులో ఫ్యాన్సీ స్టోర్ నడుపుతున్న ఓ వ్యక్తి ఒకరు రెండు నెలల క్రితం రెండు కోట్ల రూపాయల అప్పు చేసి పరారయ్యాడు. తాజాగా అతను అప్పులిచ్చిన వారికి ఐపీ నోటీసులు పంపాడు. అదేవిధంగా పట్టణంలోని నాగార్జున సెంటర్‌లో పాన్‌షాప్ నడుపుతున్న ఓ వ్యక్తి కొంత కాలంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. దీని కోసం తెలిసిన వారి దగ్గర అప్పులు చేయడంతో పాటు చిట్టీలు వేసిన వారి వద్ద అధిక వడ్డీ ఇస్తానని దాదాపు నాలుగు కోట్ల రూపాయల వరకు అప్పులు తీసుకున్నాడు. రెండు రోజులుగా అతని కనిపించకపోవడంతో ఆరా తీసిన వారికి అతను అజ్ఞాతంలోకి వెళ్లాడని, త్వరలోనే ఐపీ నోటీసులు పంపుతాడనే సమాచారం అందడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.

మోసంలోనూ నిజాయితీ..

నాలుగు కోట్ల రూపాయలతో ఉడాయించిన వ్యాపారీ తన మిత్రులను మాత్రం మోసం చేయలేదు. ఇరవై సంవత్సరాలుగా తనతో పాటు పాన్‌షాపు నడుపుకుంటున్న ఒకరు ఇతని వద్ద మూడు లక్షల రూపాయల చిట్టీ వేశాడు. వారం రోజుల క్రితం అతన్ని పిలిచి చిట్టీలను తాను ఎత్తి వేస్తున్నానని చెప్పి అతను అప్పటివరకు కట్టిన డబ్బులు మొత్తం లెక్క చేసి ఇచ్చివేసినట్లు తెలిసింది. ఇలా తన వద్ద చిట్టీలు వేసిన పలువురు చిరు వ్యాపారులకు అతను పిలిచి డబ్బులు ఇచ్చి.. పెద్దఎత్తున వడ్డీలు వసూలు చేస్తున్నవారికి మాత్రం ఇవ్వకుండా అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.